క్లుప్తంగా

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టిన అధికారులు

పాయకరావుపేట: మండలంలో పలు గ్రామాల్లో శనివారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఎంపీడీవో జయప్రకాష్ రావు తెలిపారు. డ్రైనేజీల్లో పూడిక తీయించడం , రోడ్లపై చెత్తను తొలగించడం, ఎప్పటి కప్పుడు చెత్త నుంచి సంపద కేంద్రాలకు తర లించారన్నారు. అదేవిధంగా సామాజిక పింఛన్ల బట్వాడాను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పెళ్లిరాట మహోత్సవం



పెళ్లిరాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: స్థానిక మెయిన్ రోడ్డులోని లింగ రాయి గుడిలో శనివారం పెళ్లిరాట ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా రాట కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుడు శర్మ నేతృత్వంలో రాట వేశారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే రోజు మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రికి గ్రామంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆంజనేయ ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత అప్పారావు

నక్కపల్లి: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన కొల్నాటి అప్పారావు రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. శనివారం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో అవసరమైన వసతుల కోసం ఈ నిధులు ఉపయోగించాలని దాత కోరారు. కార్యక్రమంలో కమిటీ వర్గాలు వీసం రామకృష్ణ, శ్రీపాద ప్రణవ్‌రామ్, మేడేటి శంకర్, కోసూరు శ్రీను, నవర నూకరాజు శర్మ పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణలపై సర్వే



ఊడిపల్లపు కాలువ ఆక్రమణలను సర్వే చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: మండలంలో పెదరాంభ్రపురం వద్ద నున్న ఊడిపల్లపు కాలువ ఆక్రమణలను సర్వే చేయించామని నీటిపారుదల శాఖ ఏఈ శ్రీరామమూర్తి తెలిపారు. కాలువ పరిధిలో వంద మీటర్లు మేర దెబ్బతిన్న గట్టును పునరుద్ధరించుటకు సంబంధిత స్థల యాజమానికి తెలియజేశామన్నారు. పెంటకోట వద్ద పాటి కాలువ, ఇసుక కాలువలపై మదుములు, గేట్లు పరిశీలించామన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అచ్యుతాపురం: మండలంలోని మార్టూరులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 13న నిర్వహించనున్న నూకాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో 55 జట్లు పాల్గొంటున్నాయి.

విద్యతో పేదరికం దూరం

అనకాపల్లి టౌన్: విద్య వల్ల పేదరికం తొలగిపోతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు, మాజీ సివిల్ సర్వీస్ అధికారి కర్నల్ గారియన్ తెలిపారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించడం ద్వారా విద్యార్థుల జీవితాలు ప్రగతి వైపు నడుస్తాయన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు వైద్యునిగా, ఇంజనీరుగా, సివిల్ సర్వీస్ అధికారిగా, రాజకీయవేత్తగా, వ్యాపారవేత్తగా, క్రీడాకారునిగా ఒక లక్ష్యం నిర్దేశించుకొని నిరంతరం కృషి చేయాలని సూచించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



యలమంచిలి పట్టణంలో పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పాయకరావుపేట: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 295 మంది, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 613 మంది, కార్తికేయ జూనియర్ కళాశాలలో 332 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండు కేంద్రాల్లోను 1,130 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొలిరోజు ప్రశాంతం

యలమంచిలి రూరల్: పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. సెట్–2 ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించారు. యలమంచిలి పట్టణ, రూరల్ పోలీసులు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లతో ప్రదర్శించిన నోటీసు బోర్డులో సప్లిమెంటరీ విద్యార్థుల నంబర్లు లేకపోవడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. చివరకు వారందరికీ కేటాయించిన రెండు గదులను చూపడంతో సమస్య పరిష్కారమైంది.

కల్యాణ మండపం అభివృద్ధికి సహకరించాలి

- దక్కన్ కంపెనీ ప్రతినిధులకు వినతి



దక్కన్ కంపెనీ ప్రతినిధులకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి: స్థానిక సుబ్బరామిరెడ్డి, హెటిరో కల్యాణ మండపం అభివృద్ధికి సహకరించాలని కల్యాణ మండప నిర్వాహకులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, శ్రీపాద ప్రణవ్‌రామ్, కోసూరు శ్రీను, ఎ. శంకర్ తదితరులు కోరారు. శనివారం వీరంతా పాయకరావుపేట మండలంలో దక్కన్ కంపెనీ ప్రతినిధులను కలిసి వినతి పత్రం అందజేశారు. నక్కపల్లిలో గతంలో నిర్మించిన కల్యాణ మండపంలో కొన్ని వసతులు కల్పించాల్సి ఉందన్నారు. హెటిరో కంపెనీ యాజమాన్యం రెండో అంతస్తు నిర్మించిందన్నారు. శుభ కార్యాలు చేసుకునే వారి కోసం గదులు, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. నిధుల కొరత కారణంగా వాటిని కల్పించలేని పరిస్థితి నెలకొందని, యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యంతో చర్చించి నిధులు విడుదలకు కృషి చేస్తామని ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

మునగపాకలో వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ మారిన ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. శనివారం సాయంత్రం స్థానిక మెయిన్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారి నుంచి కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి



మహిళా దినోత్సవం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీ

యలమంచిలి రూరల్: విద్యార్థి దశ నుంచే బాలికలంతా మహిళల గొప్పతనాన్ని తెలుసుకుని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎదగాలని మహిళాశిశు సంక్షేమ శాఖ యలమంచిలి సూపర్‌వైజర్ షేక్‌రంజాన్ బీబీ సూచించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యలమంచిలి పట్టణం తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమకాలీన ప్రపంచంలో మహిళలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. బాలికల రక్షణకు, విద్యావకాశాలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న చట్టాలను గురించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. లక్ష్మి, టి. లక్ష్మి, ఎం. రమ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న కంబాల



గౌరీపరమేశ్వరుల సేవలో కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో గౌరీ పరమేశ్వరులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకున్నారు. శనివారం ఇక్కడ గౌరీపరమేశ్వరుల సంబరం సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ గ్రామ నాయకులు పాలపర్తి సతీష్, యాగదాసు శేఖర్, పడాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



మహిళా సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్యులు



పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళలకు వైద్య చికిత్సలు



కిశోర్ బాలికలతో ర్యాలీ

నక్కపల్లి: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసు సిబ్బందికి, సచివాలయ మహిళా పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించామని సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, ఏమైనా సమస్యలు ఉంటే ఉచితంగా మందులు అందజేశారన్నారు. స్థానిక పాఠశాలల్లో బాలికలకు ఓపెన్‌హౌస్ నిర్వహించామన్నారు. మహిళల చట్టాలు, వారి రక్షణ కోసం చర్యలు, ర్యాగింగ్, లైంగిక దాడులను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఫిర్యాదులు ఎలా చేయాలి, పోలీసుల విధులు, బాధ్యతలు, తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు.

అచ్యుతాపురం రూరల్: స్థానిక పోలీస్ స్టేషన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో మహిళలకు, మహిళా పోలీస్ సిబ్బందికి మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అచ్యుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సిబ్బంది కిశోర్ బాలికలతో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. శనివారం మొదలు ఎనిమిది రోజులపాటు జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రోజుకో కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, వైద్యాధికారి శ్రావ్య, హెచ్ఎం ఎం.పద్మావతి, పాఠశాల సిబ్బంది అపరంజని, పైడికొండ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

జెడ్పీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రాములమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు, నాయకులు

ఎస్.రాయవరం: కుటుంబంలో కష్టం వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జెడ్పీటీసీ కాకర దేవి తల్లి సప్పారపు రాములమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం ఆమె పెద్ద కార్యం కావడంతో జోగులుతోపాటు పార్టీ నాయకులు చినగుమ్ములూరులో జెడ్పీటీసీ దేవిని పరామర్శించారు. మృతురాలు రాములమ్మ చిత్రపటం వద్ద పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ లోవలక్ష్మి, సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, మల్లే లోవరాజు, చోడిపల్లి శ్రీనివాస్, భూపతి అప్పారావు, పాలపర్తి పాపారావు, శానాపతి శ్రీరాములు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, కేసుబోయిన వెంకటలక్ష్మి, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, నాయకులు వెదుళ్ల బంగారి, చేకూరి రామరాజు, నక్కా నాగేశ్వరరావు, పోలినాటి రాజు పాల్గొన్నారు.

అప్పలరాజుకు పరామర్శ..

పి.ధర్మవరం గ్రామంలో ఇటీవల కాలికి గాయమై చికిత్స చేయించుకున్న పల్లా అప్పలరాజును మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం పరామర్శించారు. బెంగళూరులో ఎయిర్‌పోర్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న అప్పలరాజు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. నాయకులు వెదుళ్ల బంగారి, కర్రి శ్రీను, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మైలపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్–16 బాధితులకు నష్టపరిహారం చెల్లించాం

అనకాపల్లి టౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ నుంచి సబ్బవరం మండలం అమృతపురం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించామని ఎన్‌హెచ్–16 జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాయంలో శనివారం ఆయన రైతుల భూములకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన 80 శాతం రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందన్నారు. మిగిలిన రైతులకు కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న హెచ్ఎం

ఎస్.రాయవరం: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల క్రమ శిక్షణ కలిగి ఉంటారని హెచ్ఎం రమణశ్రీ తెలిపారు. దార్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ఆమె శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇక్కడ పాఠశాలలో నెల రోజులు క్రితం 60 విద్యార్థులకు దాతలు సహకారంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభించారు. విద్యార్థులు ఇటువంటి శిక్షణ పొందడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తక్షణ సహాయక చర్యలు చేస్తారన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని మూలపేటలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. దుడ్డు మోహనరావు, ప్రకాశరావుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. తోటాడ, మూలపేట సర్పంచ్‌లు దొడ్డి మంగవేణి, భీశెట్టి గంగప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేత బొడ్డేడ చెల్లయ్యనాయుడు తదితరులు అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న జగ్గారావు కుటుంబ సభ్యులు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన ఆళ్ల పెద అప్పలనాయుడు జ్ఞాపకార్థంగా జగ్గారావు కుమారులు బలరామకృష్ణ, గణేష్ శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. మెలిపాకకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గుంట్ల అప్పారావు రూ.5,117 విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుందరంగా నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి రాము, ఆడారి కాశీబాబు, ఆడారి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట ఉమేష్, దాడి సూరిబాబు, విల్లూరి నూకనరసింగరావు, దొడ్డి అప్పలనాయుడు, ఆడారి రాజు, ఆడారి గోపి, భీశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



కోటవురట్ల పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



పరీక్ష సామగ్రి అందుకుంటున్న విద్యార్థులు



నృత్యాలు వేస్తున్న విద్యార్థినులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఫేర్‌వెల్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆట పాటలతో అలరించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడు నాగన్నదొర తెలిపారు. శనివారం గుడివాడ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సిని గీతాలకు స్టెప్‌లు వేసి సందడి చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. పెదఉప్పలం ఉన్నత పాఠశాలలో ఫేర్ వెల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కుందూరు రాజు, మహేశ్వరి, భవాని, భాస్కరరావు, కుమారి, పద్మావతి పాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ విభీషణరావు

కోటవురట్ల: బాలికలు ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కోవాలని ఎస్ఐ రమేష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు ఎదురవుతున్న సమస్యలు, దాడులను వివరించి ఎలా వ్యవహరించాలో సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గుర్తించాలని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో లభించే సేవలు, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టరు అనీష ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పద్మ, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సన్మార్గంలో నడవాలి

మునగపాక: ప్రతీ విద్యార్థి సన్మార్గంలో నడవాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి కల్మషం లేకుండా నిజాయితీగా ఉండాలన్నారు. చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆరోగ్యంగా ఉన్ననాడే చదువుపై దృష్టి సారించగలరన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దేవకి, మహిళా పోలీసు వరలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్టేషన్‌లోని ఎస్ఐ గది, మహిళా, పురుషులకు సంబంధించిన లాకప్ రూమ్‌లను చూపించారు.

ఎస్.రాయవరం: మహిళలు అన్ని విషయాల్లో ధైర్య సాహసాలతో ముందుకు రావాలని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కారం వైపు ఆలోచన చేయాలన్నారు. స్థానిక మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పదిలో శత శాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు

మునగపాక: పదిలో శత శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. ఏకాగ్రతతో చదువుకుంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను ఆయన శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. పదిలో మంచి మార్కులు రావాలంటే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. ఏకాగ్రత పెంచుకొని వెనుకబడిన సబ్జెక్టులపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదువుకోవాలన్నారు. ఆయన వెంట ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, పీఎంసీ చైర్మన్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.